# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 314: యువతల సందేహ నివృత్తి
# ఏప్రిల్ 6, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 118-123 నుండి తీసికొనబడినవి

**స్వామి! ఎన్నో ఏళ్ల నుండి మీ దగ్గిరే ఉండి మీ దివ్యోపన్యాసములు వింటున్నా మేము జీవించే ధోరణిలో ఏ మాత్రము మార్పు కనబడడం లేదు. దయ చేసి మాకు దారి చూపండి.**

భగవాన్: సాధన లేకపోవడమే దానికి కారణం. కరెంటు లేకపోతే చీకటిలో నుంచొని 'దీపం' అంటే వెలుతురు వస్తుందా? దానిని వెలిగిస్తేనే వెలుతురు వస్తుంది.

ఆకలితో ఉన్న వాడికి తినుబండారాల జాబితా చూస్తే ఆకలి తీరుతుందా? రోగమున్న వాడు మందు యొక్క పేరు వింటే రోగము నయమౌతుందా? నిరుపేద వాడు అర్థికశాస్త్రం, గణనశాస్త్రం నేర్చుకుంటే బాధ తగ్గుతుందా? సాధన చేయకపోతే గ్రంథాలు చదివినంత మాత్రాన ముక్తి లభిస్తుందా?

చెప్పి చేయకపోకుండే కంటే చెప్పకుండా చేయడం మంచిది. మీకు పదే పదే చెపుతుంటాను, మీరు చెప్పినది సాధన చేయకపోతే సంవత్సరాల తరబడి ఉపన్యాసాలు విన్నా ఏమి ఫలితం ఉండదు.

చిన్న ఉదాహరణ తీసుకోండి. మీ దగ్గిర ఒక అగ్గిపెట్టి నిండా అగ్గిపుల్లలు ఉన్నాయి. ఒక దీపమును వెలిగించాలంటే ఆ అగ్గిపెట్టెను తీసి అందులోని ఒక అగ్గిపుల్లను పెట్టి మీద గీస్తే అప్పుడు వెలుగుతుంది. ఒక వేళ మళ్ళీ మళ్ళీ గీసినా అగ్గిపుల్ల వెలగకపోతే ఏమని అర్థం? అగ్గిపెట్టె తడిగా ఉండి ఉంటుంది. ఎంత గీసినా వెలగదు. అప్పుడు ఏమి చేయాలి? అగ్గిపెట్టెను కొంత సేపు ఎండలో ఆరపెట్టాలి.

అదే విధంగా మీరు సంసార బంధాలలో మునిగి ఉన్నారు. అందుకని జ్ఞానమనే దీపమును వెలిగించలేరు. సన్యాసమనే ఎండలో మీ మనసులో ఉండే వాంఛలను, సంసార సుఖములను ఆరపెట్టండి. అప్పుడే జ్ఞానమనే దీపమును వెలిగించగలరు. మీరు ఒక్క ఉపన్యాసములోని సారమును కూడా పాటించకపోతే ఇక్కడ ఎన్ని ఉపన్యాసములు ఎంత కాలం విన్నా ఏమి ఫలితముండదు.

**స్వామి! మా ఆలోచనలు తప్పు మార్గములో ఉన్నందు వల్ల మా ప్రయత్నాలు ఫలించనప్పుడు అశాంతతతో కృంగిపోతాము. దయచేసి మాకు మార్గము చూపండి.**

భగవాన్: మీ అశాంతత, అలజడి, నిరాశ, నిస్పృహ, వ్యాకులత, ఓటములకు కారణము మీ ఆలోచనలు తప్పు మార్గములో ఉండడమే. మీ జీవితంలో ఏమి జరిగినా కూడా "ఇది నా మంచి కొరకే" అని తలవండి. ఏమి జరిగినా చివరికి మీ మంచి కొరకే అని అర్థం చేసుకోండి. దీనినే పాజిటివ్ థింకింగ్ అంటారు. మీకు నిండా నెగటివ్ ఆలోచనలు ఉంటే భగవంతుని ఎలా అనుభవించ గలుగుతారు?

మీ దేహము, మనసు, బుద్ధి, ఇంద్రియములు అన్నీ నెగటివ్. మీ అంతరాత్మ అయిన ఆత్మ ఒక్కటే పాజిటివ్. భగవంతుడే మీ అంతరాత్మ. మీరు భగవంతుని ఎందుకు అనుభవించలేక పోతున్నారు? ఈ నెగటివ్

ఆలోచనలు వల్లనే. అందుచేత ఆధ్యాత్మిక మార్గములో ముందుకు వెళ్ళాలంటే పాజిటివ్ గా ఆలోచించడం అత్యంత ముఖ్యం. అప్పుడే మీకు శాంతి, సౌఖ్యము, ఆనందం లభిస్తాయి.

నిన్ను నీవే ఉదాహరణగా తీసుకో. నీ పాజిటివ్ థింకింగ్ వల్లనే నీ academic programను ప్లాన్ చేసుకొని దానికి తగిన ప్రయత్నాలు చేసి, పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకొని, తర్వాత మంచి ఉద్యోగము సంపాదించుకో గలవు. కానీ ఎక్కువ జీతము కొరకు, ఫారిన్ వెళ్ళి ఎక్కువ సంపాదించుట కొరకు, కట్నము ఎక్కువ ఇచ్చే అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకోవడము నెగటివ్ గా ఆలోచించడం.

మీ తల్లితండ్రులను తీసుకొంటే, నిన్ను చదివించడం పాజిటివ్, కానీ నీ చదువును ఒక వ్యాపారం మాదిరి తలిస్తే అది నెగటివ్ అవుతుంది.

ఒక డాక్టరు రోగిని నయము చేయడము పాజిటివ్, కానీ ధన సంపాదన కొరకు రోగిని నయము చేయడము నెగటివ్ అవుతుంది. మనము మన హృదయాలను దైవ చింతనలు ఆధ్యాత్మిక భావనలు వంటి పాజిటివ్ తలపులతో నింపుకోవాలి. అప్పుడే మీరు అత్యంత పాజిటివ్ అయిన, సచ్చిదానందుడు అయిన, భగవంతుడిని అనుభవించ గలుగుతారు.

అందువల్లనే మీకు వచ్చే బాధలు, కష్టాలు, నష్టాలు, ఓటములు, నిందలు, ఇంకేమి వచ్చినా మీ మంచి కొరకే అని తలచటము అతి ముఖ్యము! ఇదే పాజిటివ్ థింకింగ్. మీకే తర్వాత అర్థమౌతుంది ఇవన్నీ మీ మంచి కొరకే జరిగినవని.

ఒక చిన్న కథ: ఒక రాజు గారికి ఒక రోజు ఒక చిన్న కోరిక కలిగింది. ఏమని? ఒక చెఱకును తనకు తానే చిన్న చిన్న ముక్కలు కోసుకొని తినాలని. అలా ముక్కలు కోస్తుండగా పొరపాటున తన వేలును కోసేసుకున్నాడు. పక్కనున్న మంత్రి వెంటనే, “ఓ రాజా, మీ వేలును కోసేసుకున్నారు. అది మీ మంచి కొరకే,” అన్నాడు.

ఆ రాజు గారికి వెంటనే కోపం వచ్చేసింది. “నా వేలు తెగడం నా మంచి కొరకు ఎలా అవుతుంది? నా తల తెగితే కూడా ఈ మంత్రి నా మంచి కొరకే అంటాడా?” అనుకుని ఆ మంత్రిని చెరసాలలో వేయించాడు. “ఓ రాజా, ఈ కారాగార శిక్ష నా మంచి కొరకే,” అన్నాడు మంత్రి.

కొంత కాలం తర్వాత రాజు గారు దగ్గరలో ఉన్న అడవికి వేటకని ఒక్కడే వెళ్ళాడు. దారి తప్పిపోయి ఒక ఆటవిక ప్రదేశంలోకి ప్రవేశించాడు. వారు ఆ సమయంలో వారి జాతి దేవతకు బలి ఇవ్వడానికి ఒక మనిషి కొరకు వెతుకుతున్నారు. ఈ రాజును పట్టుకొని వారి పెద్ద వద్దకు తీసుకెళ్ళారు. ఆ పెద్ద రాజును పైనుంచి కింద దాకా పరిశీలించి చూసి, “ఈ రాజును బలి ఇవ్వడానికి వీలు లేదు. వేలు లేని వికలాంగుడిని దేవతకి బలి ఇవ్వకూడదు,” అని అతనిని వదిలేశారు.

దారిలో రాజు తన మంత్రి చెప్పిన దానిలోని అంతరార్థము గుర్తించాడు. ఆ మంత్రిని పిలిపించి అన్నాడు, “ఓ మంత్రీ, నువ్వు చెప్పింది ఎంత నిజము. నాకు వేలు లేనందు వల్లనే కదా ఆ ఆటవికులు నన్ను వదిలేసింది. కానీ నాకు ఒక సంశయం. నిన్ను చెరసాలలో వేస్తే కూడా అది నీ మంచికే అన్నావు. ఎలాగ?” అని అడిగాడు.

మంత్రి చెప్పాడు, “నన్ను చెరసాలలో బంధించక ఉండి ఉంటే మీతో పాటు నేను కూడా ఉండే వాడిని. అప్పుడు ఆ ఆటవికులు నన్ను పట్టుకొని చంపి బలి ఇచ్చే వారు. అందుచేత ఈ కారాగార శిక్ష నా మంచి కొరకే అయింది.” ఇదే పాజిటివ్ థింకింగ్. ఇలా ఆలోచిస్తే మీకు శాంతి సౌఖ్యాలు చేకూరుతాయి.

అక్కరకు రాని చుట్టము,
మ్రొక్కిన వరమీయని వేల్పు,
మొహరమున తానెక్కిన పారని గుఱ్ఱము
గ్రక్కున విడవంగవలయు గదరా సుమతీ

ఈ పద్యమునకు అర్థమేంటంటే, నీకు అవసరమైనప్పుడు రాని చుట్టము, నీవు ప్రార్థించినా వరమివ్వని దేవుడు, యుద్ధరంగంలో పరుగెత్తని గుఱ్ఱములను వెంటనే వదిలేయాలి కదా, ఓ సుమతి?

ఈ పద్యమును ఒక సుమతితో చెపుతున్నాడు, అంటే బుద్ధి కలిగి యున్నవాడు. అవసరమైన సమయములో సహాయము చేయని చుట్టాలను, యుద్ధరంగములో పరుగెత్తలేని గుఱ్ఱమును, వరములీయని దేవుని వదిలి పెట్టడములో తప్పు లేదు.

కానీ ఇక్కడ ఒక ముఖ్యమైన విషయము గుర్తించాలి. నీ చుట్టం నీకు ఎప్పుడు సహాయానికి రాలేదని వానిపై నింద వేసే ముందు నువ్వు నీ చుట్టానికి ఎప్పుడైనా సహాయం చేశావా అని గుర్తు చేసుకో.

యుద్ధరంగంలో పరిగెత్తని గుఱ్ఱాన్ని తప్పు పట్టే ముందు నీకు గుఱ్ఱమును సవారీ చేయడం సరిగ్గా వచ్చా అని చూసుకో. ప్రార్థిస్తే వరమీయని వాడు దేవుడు కాదు అనే లోపల, నీవు అడిగే వరం సరి అయినదా కాదా అని నిర్ధారించుకో.

ఈ పద్యము సుమతితో ఎందుకు చెప్పారు అంటే ఇవన్నీ ఆలోచించుకొని, ఇతరులపై నిందలు వేయకుండా, ఆలోచనలు సక్రమమైనవిగా ఉండిన వాడు సుమతి. మన తలపులు కూడా అలాగే ఉండాలి.

వచ్చే వారం స్వామి వారి నుండి మరిన్ని మధురమైన ఉపదేశములు. ధన్యవాదములు!